"నువ్వు చేసింది తప్పనను. అయినా పరిస్థితులకు కాస్తసర్దుకు పోవాలి కదా. మీ ఇల్లు ఊరికి మధ్యగా వుంది. ఇంటికానుకుని విశాలమైన అరుగూ వుంది. ఆఅరుగుమీద కూర్చుని నలుగురూ కాస్సేపు కాలక్షేపానికి పేకాడుకుంటారు.అయినా ఇన్నాళ్ళూదాన్ని పెద్దగా పట్టించుకోని నువ్వు పోయిన నెల వచ్చినప్పుడు అరుగుమీన తడిక అడ్డం కట్టావు. "ఎందుకూ?" అంటే "సుజాత వయసుకు రాబోతోంది, కాస్త మరుగూ మట్టూ వుండాలి కదా?" అన్నావు. ఆ రోజు నుంచీ సమయం కోసం ఎదురుచూస్తున్న పెద్దలకు మంచి సాకే దొరికింది. ఇప్పుడు మీ అక్క బతుకు ఏమయిందో చూడు." అన్నాడు నాగరాజు ఎంతో సానుభూతి కనబరుస్తూ.

భాస్కర్ ఏమీ మాట్లాడకుండా ఇంకా మౌనంగా వుండేసరికి మళ్ళీ నాగరాజే "మరి నువ్వయినా చెప్పొచ్చుకదా అంటావేమో? అక్కడ పేకాడేవాళ్ళంతా ఈ ఊరి పెద్దమనుషులే అయ్యారు. నేను వాళ్ళనెలా అడగ్గలను చెప్పు?" అన్నాడు నంజాయిషీ చెప్పుకునే ధోరణిలో.

"ఔను, నిజమే. మా ఇల్లు ఒక్కటే ఈ వూరికి మధ్యగ వుంది. మా ఇంటికి ఎదురుగుండా వున్న మీ ఇంటి ముందు వున్న సిమెంటు అరుగు ఏమయిపోయింది? అదిపోనీ, నువ్వు చెప్పావే 'పెద్దమనుషులు' ఆ పెద్దమనుషుల ఇళ్ళ అరుగులన్నీ ఖాళీగానే వున్నాయే! కాలక్షేపం చెయ్యడానికి అవన్నీ పనికిరావు. ఈ వూరి పెద్దమనుషులు పేకాడ్డానికి మా అరుగు ఒక్కటే కావాలసొచ్చిందన్నమాట! సరిసరి........ అదంతా ఇప్పుడెందుగ్గానీ .... మా ఇల్లు అమ్మేస్తున్నాము. అండలేనిఊళ్ళోవుండడం తప్పు. ఎవడికో అమ్మడం దేనికి? ఎదురింటివాడివి; మాకు చాలా కావలసినవాడివి. నువ్వే కొనుక్కో. వీలయినప్పుడు డబ్బు కడుదువుగాని" అనిచెప్పి భాస్కర్ అక్కణ్ణించి చరచరా వచ్చేశాడు.

ఆ రోజు సాయంకాలమే-కొండగాలీ. ఏటినీళ్ళు. సమృద్ధిగా లభించే సొంత ఊరి నుంచి నీళ్ళకూ. గాలికీ కరువైపోయిన పట్నంలోని మురికివాడకు మరో కుటుంబాన్ని చేరవేసింది ఆరుగంటల లాస్టబస్.

✱




మినీకథ



# షాక్ ట్రీట్‌మెంట్

'విహంగి'

"ఏజెంట్ ఎయిటీ ఎయిట్! గూఢచారి గుండూరావ్ నీకు తెలుసుగా"! అన్నాడు బాస్.

"తెలుసు. ఏమైంది గుండుగాడికి" అడిగాడు 88.

"మన సైంటిస్ట్ సన్నాసిరావ్‌ని శత్రువులుఅపహరించే ప్రయత్నంలో వున్నారని. గూఢచారి గుండూరావ్‌ని సన్నాసిరావ్‌కి కావలాగా వుంచాము. కాని శత్రువులొచ్చి. సన్నాసిరావ్‌ని ఎత్తుకెళ్ళి పోయారు. పోతూ. పోతూమన గూఢచారి గుండూరావ్ గుండు పగలకొట్టారు. తత్ఫలితంగా గుండూరావ్ అన్నీ మర్చిపోయాడు. అతనొక్కడే చెప్పగలడు సన్నాసిరావుని ఎవరెత్తుకెళ్ళింది. అతడ్నినయం చేయడానికి విశ్వప్రయత్నం చేశారు డాక్టర్లు. ఒక్కటీ సక్సెస్ కాలేదు. నువ్వెలాగైనా గుండూరావ్‌నుంచి నిజాన్ని రాబట్టాలి. సమర్థుడివని నీకప్పగించాం" చెప్పాడు బాస్.

ఏజెంట్ ఎనుబది ఎనిమిది చాలా సీరియస్‌గా ఆలోచించి ఒకనిర్ణయానికొచ్చాడు.

మరునటిరోజు గుండూరావ్ వున్న హాస్పిటల్‌కెళ్ళాడు ఏజెంట్ 88.

ముగ్గురు వార్డ్‌బాయ్‌లని పిల్చి. డాక్టర్ డేవిడ్‌ని గట్టిగాపట్టుకున్నాడు ఏజంట్ 88.

డాక్టర్ డేవిడ్ "హెల్ప్. హెల్ప్! ఏజెంట్ గుండూరావ్‌గారూ. కాపాడండి. శత్రు దేశస్థుల బారినుండి నన్ను కాపాడండి" అని అరవసాగాడు.

వార్డ్ బాయ్‌లు వికటాట్టహాసం చేశారు. గూఢచారి గుండూరావ్ పక్కమీది నుంచి లేచాడు.

పెద్దగా నవ్వుతూ ఏజెంట్ 88 "గుండూరావ్‌కి పాతవన్నీ జ్ఞప్తి కొస్తున్నాయి" అంటూ ఒక ఇనుపరాడ్‌తో గుండూరావ్ మాడుమీద గట్టిగా కొట్టాడు.

ఒకే ఒక్క దెబ్బతో గుండూరావ్‌కి కపాలమోక్షం! పుర్రె పగిలి. తెల్లని మెదడు బయటకొచ్చింది.

నెత్తీ.నోరూ బాదుకున్నాడు బాస్-వున్న ఒక్క ఆధారం పోయినందుకు.

"ఎలా జరిగిందిది?" అరిచాడు బాస్.

ఆ తర్వాత తెలిసింది— అంతకు ముందు రోజు ఏజెంట్ 88 తెలుగుసినిమా చూశాడని!

●